ప్రజాశక్తి
మంగళవారం 5 సెప్టెంబర్ 2023 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

ఒంగోలు తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసనలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర నాయకులు సిద్ధయ్య

సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా

నిత్యావసర వస్తువుల ధరలు, కరెంటు ఛార్జీలు తగ్గించాలని, నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో తహశీల్దార్ కార్యాలయాల వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ధరలను నియంత్రించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు.

బాపట్ల జిల్లా, కొల్లూరులో ఆర్ఐకు అర్జీ అందజేస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రమాదేవి

రబీ సానుకూలం.!

- రైతులకు ఊరట కలిగిస్తున్న వర్షాలు
- మిరప, పొగాకు నాట్లకు సన్నాహాలు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

జిల్లాలో రెండు రోజులుగా కురుస్తోన్న వర్షాలు రైతులకు ఊరట కలిగిస్తున్నాయి. శనివారం సాయంత్రం నుంచి వర్షాలు మొదలయ్యాయి. ఆదివారం పలుచోట్ల వర్షాలు కురిశాయి. సోమవారం నాడూ కొనసాగాయి. జిల్లాఅంతటా వర్షాలు పడ్డాయి. పశ్చిమాన వాగులు వంకలు పొంగాయి. నల్లమల అడవుల్లోనూ వర్షాలు కురవడంతో మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల్లోని మండలాల్లో చిన్నచిన్న వాగులు పొంగాయి. రాకపోకలకు అక్కడక్కడా స్వల్పంగా ఆటంకం ఏర్పడింది.

ఆదివారం నాడు జిల్లా సగటు 48 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. సోమవారం నాడు 17.4 మి.మీ.లు నమోదైంది. సెప్టెంబర్‌లో సాధారణ వర్షపాతం 128.5 మి.మీ.లు ఉండగా ఇప్పటివరకూ అంటే ఈ నాలుగు రోజుల్లోనే 72 మి.మీ.ల వర్షం కురిసింది. మూడు నెలలుగా వర్షాల్లేక ఖరీఫ్ చేజారింది. సెప్టెంబర్ నుంచి రబీ ఆరంభం కానుంది. ఈ వర్షాలు రబీ సాగుకు అనుకూలంగా మారాయి. వర్షాలు రైతుల్లో ఆశలు రేకెత్తించాయి. ఖరీఫ్ పంటలకు ఊపిరిపోశాయి. ఎదుగుదల దశలో ఉన్న వివిధ పంటలకు ప్రాణం పోశాయి. ఇప్పటివరకు వానల్లేక ఎండుతున్నాయి. అయితే నువ్వులు నూర్పిడి చేసి ఇళ్లకు తెచ్చుకున్న రైతులు బయటపడ్డారు. లేకుంటే తడిచిపోయేవి. ఏదేమైనా ఖరీఫ్ పంటలు సుమారు లక్షా పాతిక వేల ఎకరాల్లో సాగయ్యాయి. ఇక నుంచీ రబీ పంటలే మొదలు కానున్నాయి. కోస్తా ప్రాంతాల్లో నాగులుప్పలపాడు నుంచీ పర్చూరు ప్రాంతం వరకూ వర్షాలకు పొలాలు తడిచిముద్దయ్యాయి. పొలాల్లో నీరు చేరింది. ఈ ప్రాంతాల్లో మిరపనాట్లకు రైతులు సన్నాహాల్లో ఉన్నారు. పొగనాట్లకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. దుక్కులు దున్నారు. ఇప్పుడు విత్తనాలు వేసేందుకు పదును కూడా అయ్యింది. అన్ని

పొలంలో నిలిచిన వర్షపునీరు

రకాల పంటల సాగుకు అనుకూలత ఏర్పడింది. ఇప్పటికే పొగాకు, వరి, మిరప నార్లు పోశారు. నీళ్ల లేక ఇవి కూడా ఎండుముఖం పట్టాయి. నారుమడులకూ ఈ వర్షాలు ఉపయోగపడ్డాయి. ఖరీఫ్ సాగు వర్షాభావంతో చేజారినా ఇప్పుడు రబీపై ఆశలు కనిపిస్తున్నాయి. ప్రధానమైన పంటలన్నీ రబీలోనే సాగవుతాయి. సాగర్ నీటిపై సందిగ్ధం నెలకొంది. మాగాణి సాగుపై అయోమయం నెలకొన్న తరుణంలో రబీ మొత్తం వర్షాధారంపైనే ఆధారపడాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. ఇక వ్యవసాయశాఖ కూడా రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, ఇతర అవసరాలు తీర్చేందుకు సన్నద్ధం కావాల్సి ఉంది. ఎందుకంటే వర్షాలు లేనందున ఇప్పటివరకూ రైతులు కూడా ఖాళీగానే ఉన్నారు. విత్తనాలు ▶ 2లో

ఫలించిన ఎమ్మెల్సీ లక్ష్మణరావు కృషి

కర్లపాలెంలో 7 ఫౌండేషన్ ప్లస్ పాఠశాలలు మంజూరు

ప్రజాశక్తి-కర్లపాలెం

మండలంలోని ఏడు గ్రామాలలో పూర్వకాలం నుంచి సాల్వేషన్ ఆర్మీ నేతృత్వంలో నడిచే ఎయిడెడ్ పాఠశాలలు మూతపడ్డాయి. రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన నూతన చట్టాల కారణంగా సదరు పాఠశాలల నిర్వహణ నుంచి సాల్వేషన్ ఆర్మీ యాజమాన్యం తప్పుకుంది. తమ గ్రామాల్లో ఉన్న పాఠశాలలు మూతపడటంతో ప్రభుత్వం తరఫున పాఠశాలలు పెట్టాలని కోరుతూ ఆ గ్రామాల ప్రజలు సంవత్సర కాలంగా కోరుతున్నారు. ఈ మేరకు గ్రామస్తులు ▶ 2లో

ఎమ్మెల్సీ లక్ష్మణరావుకు అర్జీ ఇస్తున్న గ్రామస్తులు (ఫైల్)

వాగులో కూరగాయల వ్యాపారి గల్లంతు

ప్రజాశక్తి-రాచర్ల

ఆదివారం అర్ధరాత్రి నుండి కురుస్తున్న వర్షాలకు రాచర్ల మండలంలో వాగులు ఉధతంగా ప్రవహిస్తున్నాయి. సోమవారం కంభం మండలం, తురిమెళ్ల గ్రామానికి చెందిన కూరగాయల వ్యాపారి షేక్ మహమ్మద్ ఖాసింవలీ(42) బైక్‌పై వ్యాపార నిమిత్తం అక్కపల్లె గ్రామం నుండి చోళవీడుకు బయలుదేరాడు. రెండు గ్రామాల మధ్య గల లోతోగు వాగు వర్షాల కారణంగా ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో వాగుపై బ్రిడ్జి దాటేందుకు యత్నించాడు. వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ద్విచక్రవాహనంతో సహా వాగులో పడి కొట్టుకొనిపోయాడు. సమాచారం తెలుసుకున్న ఎస్సై కష్ణపావని సిబ్బందితో ఘటనాస్థలంలో గాలింపు చర్యలు చేపట్టారు. ఆచూకీ తెలియలేదు.

ఫలించిన ఎమ్మెల్సీ లక్ష్మణరావు కృషి

(మొదటిపేజీ తరువాయి)

ఎమ్మెల్సీ లక్ష్మణరావును కలిసి విజ్ఞప్తి చేశారు. సదరు ఏడు గ్రామాలలో పాఠశాలల కోసం ఎమ్మెల్సీ లక్ష్మణరావు, యుటిఎఫ్ రాష్ట్ర, జిల్లా, మండల నేతలు విద్యాశాఖ అధికారులను కలిసి విన్నవించారు. పాఠశాలల ఏర్పాటుకు ఎమ్మెల్సీ లక్ష్మణరావు నిరంతర పర్యవేక్షణ చేశారు. గ్రామస్తులు కూడా పట్టుపట్టడంతో అందరి కషి ఫలితంగా విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ కర్లపాలెం మండలంలోని ఏడు గ్రామాలలో ఫౌండేషన్ ప్లస్ పాఠశాలలు ఏర్పాటు చేస్తూ జీవో నెంబర్ 190 విడుదల చేశారు. మంజూరయిన పాఠశాలలను ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ లక్ష్మణరావు కోరారు.

రబీ సానుకూలం

(మొదటిపేజీ తరువాయి)

వేసే పరిస్థితి కూడా లేదు. 22 శాతం మాత్రమే ఖరీఫ్ పంటల సాగు జరిగింది. కొన్ని ప్రత్యామ్నాయ పంటలకు ఈ నెలాఖరు వరకూ అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ఏఏ పంటలు సాగు చేసుకోవచ్చనేది రైతులకు చెప్పాలి. ఆ పంటల తాలూకు విత్తనాలు కూడా అందించాలి. రబీలో సాగు చేసే పంటలకు సబ్సిడీపై విత్తనాలు అందించాలని రైతులు కోరుతున్నారు.

భారీగా వర్షాలు

గిద్దలూరు రూరల్: గిద్దలూరు పరిసర ప్రాంతం, నల్లమల అడవుల్లో ఆది, సోమవారాల్లో నిరంతరాయంగా వర్షం కురిసింది. వర్షాలకు సగిలేరు, ఉప్పు వాగు, గుండ్లకమ్మ వాగులు ఉధతంగా ప్రవహిస్తున్నాయి. గిద్దలూరు మండలం, వెంగల్‌రెడ్డి పల్లి గ్రామం వద్ద చెక్ డ్యామ్ కు గండిపడి నీరంతా వథాగా పోతోంది. దీంతో స్థానిక రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాచర్ల మండలం శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి దేవస్థానం వద్ద గల నెమలిగుండం పొంగిపొర్లుతోంది. గుండ్లకమ్మ వాగు ప్రవహిస్తూ.. రామన్న కతువ ప్రాజెక్టు నిండి.. కంభం చెరువుకు నీరు భారీగా చేరుతోంది.

బీటలిచ్చిన రైల్వే బ్రిడ్జి

రాచర్ల: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని గుడిమెట్ట గ్రామం వద్ద గల సౌత్ సెంట్రల్ రైల్వే అండర్ బ్రిడ్జి గోడలు బీటలిచ్చాయి. దీంతో ఆ రహదారిలో ప్రయాణం చేయాలంటే ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

ఉపసర్పంచ్ ఎన్నిక వాయిదా

ప్రజాశక్తి-పిసిపల్లి

రాష్ట్ర ఎన్నికల సంఘం వారి ఆదేశాల మేరకు పెదచెర్లోపల్లి మండల పరిధిలోని పెదఅలవలపాడు గ్రామ పంచాయతీలో ఉప సర్పంచ్ ఎన్నిక కొరకు తేది.04.09.2023న ఉదయం 11గంటలకు ఏర్పాటు చేయగా వార్డు సభ్యులు ఎవరూ హాజరు కానందున ఈ ఎన్నికకు సంబంధించిన ఈ నెల 5వ తేది మంగళవారం ప్రత్యేక సమావేశం వాయిదా వేసినట్లు ఎంపిడిఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

ఉప సర్పంచిగా పిడికిటి శ్రీనాథ్

ప్రజాశక్తి-టంగుటూరు

మండలంలోని పొందూరు గ్రామ పంచాయతీ ఒకటవ వార్డు సభ్యులు, ఉప సర్పంచ్‌గా ఉన్న కాట్రగడ్డ అనిల్ కొంతకాల క్రితం అనారోగ్యంతో మతి చెందారు. ఈ సందర్భంగా ఎన్నికల కమిషన్ ఆదేశాలతో పొందూరు 1వ వార్డుకు ఇటీవల నిర్వహించిన ఉపెన్నికల్లో గెలుపొందిన పిడికిటి శ్రీనాథ్‌ను పొందూరు గ్రామ ఉపసర్పంచ్‌గా వార్డు సభ్యులు ఎన్నుకున్నారు. గ్రామ పంచాయతీలోని మొత్తం 12 వార్డులలో 8 మంది వార్డు సభ్యులు శ్రీనాథ్‌కు మద్దతు తెలపడంతో ఉపసర్పంచ్ పదవి ఆయన్ను వరించింది. ఈ సందర్భంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి వాకా జగన్మోహన్ రెడ్డి ఉప సర్పంచ్ నియామక పత్రాన్ని శ్రీనాథ్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యేజర్ల పద్మ, గ్రామ సర్పంచ్ పిల్లి కోటిలింగం, వార్డు సభ్యులు, పలువురు గ్రామ నాయకులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన సాంకేతిక విద్య 'కిట్స్' సొంతం

కళాశాల అధినేత అన్నా కృష్ణచైతన్య

ప్రజాశక్తి-మార్కాపురం

విలువలతో కూడిన సాంకేతిక విద్య కిట్స్ ఇంజిరింగ్ కళాశాల సొంతమని ఆ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ అన్నా కృష్ణ చైతన్య పేర్కొన్నారు. కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియంటేషన్ డే సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నా కష్ణచైతన్య మాట్లాడుతూ కళాశాలలో అత్యున్నతమైన సాంకేతికతో కూడిన విద్యతో పాటు విలువలతో కూడిన విద్యను అందిస్తున్నామన్నారు.కిట్స్ కళాశాలలో చదివేందుకు ఎంపిక చేసుకున్న ఇంజనీరింగ్ విద్యార్థిని విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు కతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఏ.రంగనాయకులు, కళాశాల ఎఒ బి ప్రభాకర్, ఎన్ఎస్ఎస్

కార్యక్రమంలో మాట్లాడుతున్న అన్నా కృష్ణ చైతన్య

ప్రోగ్రామ్ ఆఫీసర్ అనిల్ కుమార్, వివిధ విభాగపు అధిపతులు రామ్మోహన్, డాక్టర్ అనిల్ కుమార్, రాముడు, కిషోర్ బాబు, ప్రసన్న మురళి , రమణారెడ్డి, మనోహర్ పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్టలో బూచేపల్లి వెంకాయమ్మ

విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న జడ్‌పిటిసి ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

ప్రజాశక్తి-దరిశి

మండలంలోని తుమ్మెదలపాడు గ్రామంలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని సోమవారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పాల్గొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలనలో అందరు సురక్షితంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ నల్లదిమ్ము వెంకట శేషిరెడ్డి, మాజీ సర్పంచులు కోటా శ్రీనివాసరెడ్డి, ఎన్ బ్రహ్మారెడ్డి, చింతలపూడి శ్రీనివాసరెడ్డి, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు. అదేవిధంగా తాళ్ళూరు మండలం రజానగరంలో నాగారమ్మప్ప పొంగళ్ళ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్ధానిక ఎమ్మెల్యే డాక్టరు మద్దిశెట్టి వేణుగోపాల్ సోదరుడు మద్దిశెట్టి రవీంద్ర, ఎంపిపి తాటికొండ శ్రీనివాసరావు, జడ్‌పిటిసి మారం వెంకటరెడ్డి, రజానగరం సర్పంచ్ వలి, స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

కొలుపుల్లో నాయకుల సందడి

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలంలోని గోపాల్‌నగర్‌లో అడక వారి నాగర్పమ్మ అమ్మవారు దేవర కొలుపులు సందర్భంగా సోమవారం అమ్మవారు దేవస్థానంలో పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కొండేపి శాసనసభ్యులు డాక్టర్ డోల శ్రీ బాల వీరాంజనేయస్వామి టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్యనారాయణ (సత్య) హాజరై పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం గ్రామస్తులు ఘనంగా వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వేల్పుల సింగయ్య, చీమకుర్తి కష్ణ, కూనపురెడ్డి వెంకట సుబ్బారావు మించల బ్రాహ్మయ్యా నక్క బ్రహ్మేశ్వర రావు గాలి హరిబాబు నర్రా రాంబాబు మేకల అంకమరావు రావులపల్లి వెంకట్రావు తదితరులు ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడిగా కోటిమోహన్

ప్రజాశక్తి-తర్లుపాడు

కోటిమోహన్

తర్లుపాడు మండలం చెన్నారెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా విద్యార్థులకు బోధన అందిస్తున్న పెరుమాళ్ళ కోటిమోహన్ ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు గ్రహీతను పొందినందుకు గ్రామ ప్రజలు, మిత్రులు, ఉపాధ్యాయులు పలువురు కోటిమోహన్‌కు అభినందనలు తెలిపారు.

పోలీసు సిబ్బందికి ప్రశంసా పత్రాలు

ప్రజాశక్తి- గిద్దలూరు రూరల్

గిద్దలూరు సిఐదేవ ప్రభాకర్ , పోలీసు సిబ్బంది ఎస్‌పి మల్లిక గర్గ్ చేతుల మీదుగా సోమవారం ప్రశంసా పత్రాలు అందుకున్నారు. గిద్దలూరు సమీపంలోని ఉప్పు వాగులో గల్లంతైన యువకులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చడంలో కీలకపాత్ర పోషించిన సిఐ దేవ ప్రభాకర్ , గిద్దలూరు పోలీసు సిబ్బందిని ఎస్‌సి అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. సకాలంలో స్పందించి యువకులను కాపాడిన సిఐ, పోలీసులకు ప్రజలు అభినందనలు తెలిపారు.

ప్రశంసా పత్రాలతో సిబ్బంది

KANAKADURGA FINANCE LIMITED
(RBI ద్వారా గుర్తింపు పొందినది)
బ్రాంచిఆఫీస్ : Opp.చుండూరు పెట్రోల్ బంక్, అద్దంకి బస్టాండ్, ఒంగోలు

బంగారు వేలం ప్రకటన

ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది. 25-09-2023 ఉ॥ 10-00 గం॥లకు మా బ్రాంచి ఆఫీసు నందు 638.48 గ్రాముల వస్తువులు కుదవపెట్టిన పాత బంగారం నగలు హెడ్డాఫీసు : డోర్ నెం.54-9-23, 100 అడుగుల రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7 నందు వేలం వేయబడుతున్నాయి. వేలం వేయబడుతున్న నగలు వినియోగదారులు సమయం దాటిపోయిన విడిపించుకోకుండా వదిలిపెట్టిన నగలు అప్పులు తీసుకున్న వారందరికీ మా వేలం నోటీసులు రిజిష్టర్ పోస్టుద్వారా పంపించడం జరిగింది. వేలంలో పాల్గొనదలచిన వారు తమ అడ్రస్ ప్రూఫ్ మరియు ఐడి ప్రూఫ్ వెంటే తీసుకొని రావాలి. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మరిన్ని వివరాలు మరియు నియమ నిబంధనల కొరకు దయచేసి విజయవాడలో మా హెడ్డాఫీసులో సంప్రదించండి.

ఆథరైజ్డ్ ఆఫీసర్
కనకదుర్గా ఫైనాన్స్ లిమిటెడ్
H.O. : 100 అ॥ రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7.
Cell : 8008812798

Notice Under Order 5 Rule 1 of C.P.C.
పొదిలి జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
O.S.No. 243 / 2019

షేక్. ఖుర్షిద్ బేగం, వగైరాలు ... వాదులు
Vs
చల్లా శ్రీను ... ప్రతివాది

To,
చల్లా శ్రీను, తండ్రి రాములు,
9వ వార్డు, ఎస్.టి. కాలనీ వద్ద, పొదిలి గ్రామం, మరియు మండలం, ప్రకాశం జిల్లా.

అయ్యా,
పై నెంబరున వాదులు నీ నుంచి దావా పరిహారం అనగా దావా షెడ్యూలు ఆస్థి స్వాధీనం కోరి పై దావా నీపైన దాఖలు చేసివున్నారు. యిందు విషయమై పై దావాలో నీకు నోటీసు నిమిత్తం తే12-09-2023 ది వాయిదా వేయబడివున్నది. కాన పై తేదీన ఉదయం 10.30 గంటలకు పై కోర్టు వారి ఎదుట హాజరై నీకు గల ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల పై దావా నీ పరోక్షమందు తీర్మానింతురు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
డి.రామక్రిష్ణ
వి.నాగరాజు
వాదుల ప్లీడర్లు.

ఉపాధ్యాయురాలికి సన్మానం

ప్రజాశక్తి-పిసిపల్లి

పెదవరిమడుగు పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయురాలు సిహెచ్.అరుణను గ్రామస్తులు ఘనంగా సోమవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ మోతుకూరి నరసింహ, వారి సతీమణి రత్నకుమారి రూ.40 వేల రూపాయల విలువైన బంగారు ఉంగరాన్ని బహుకరించారు. ఈ కార్యక్రమంలోఎంపీడీఓ శీనివాసరెడ్డి, మండల విద్యాశాఖ అధికారులు సంజీవి మరియు శ్రీనివాసులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎలిజిబెత్‌రాణి, ఉపాధ్యాయులు ఏసుబాబు, పోతులూరయ్య, శ్రీవేణి, స్వర్ణ రమణయ్య, యుటిఎఫ్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పుట్టిన రోజు వేడుకల్లో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి -గిద్దలూరు రూరల్

గిద్దలూరు మండల జడ్పిటిసి సభ్యులు బుడతా మధుసూధన్ యాదవ్ కుమార్తెల పుట్టినరోజు కార్యక్రమంలో గిద్దలూరు నియోజకవర్గ వైసిపి, టిడిపి ఇరు పార్టీల ఆదినాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యశస్విని, మనస్వినిల పుట్టినరోజు వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు, మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డిలు పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసీపీ, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, SHAIK KHASIM SAHEB, S/o. SHAIK MUSHA SAHEB (Old Name), resident of H.No.37/1/169/30/1, Satyanarayanapuram, Mattam Bazar, Ongole, Prakasam District - 523001, Andhra Pradesh. I have changed my name from SHAIK KHASIM SAHEB, to SHAIK KASIM SAHEB (New name), S/o. SHAIK MUSHA SAHEB, Hence forth i will be known as SHAIK KASIM SAHEB will be applicable for all purposes

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.NO 365/2022

ఈపనగండ్ల అల్లావలి ....వాది
వర్సస్
కలగొట్ల సిద్దయ్య ....ప్రతివాది

To
ప్రతివాది చిరునామా
కలగొట్ల సిద్దయ్య తండ్రి చిన్న సిద్దయ్య, వయస్సు 36 సంవత్సరాలు, దూదేకుల, వ్యాపారం, పోసుపల్లి గ్రామం, కొమరోలు మండలం, ప్రకాశం జిల్లా.
ప్రస్తుత చిరునామా :
సంజీవరెడ్డి నగర్ 3వ లైన్, HDFC బ్యాంకు ఎదురు వీధి, గిద్దలూరు గ్రామం, గిద్దలూరు మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు దావాలో వాది మీ నుండి పరిహారం రాగోరి పై దావా దాఖలు చేసినందున, సదరు దావాలో నీవు కోర్టుకు హాజరై ఆక్షేపణలు తెలుపుటకు తేదీ 05-09-2023న వాయిదా వుండినది. కావున నీవు వాయిదా రోజున ఉదయం 10-30 నిమిషాలకు నీవు స్వయంగా కానీ, లేదా నీ వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరై నీ ఆక్షేపణలుంటే తెలుపుకునేది, లేనిచో నీ పరోక్షమందు సదరు దావాను విమర్శించి తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

గిద్దలూరు
తేదీ 04-09-2023 ఇట్లు
శ్రీ ఎ.తిరుమల ప్రసాద్,
వాది పరం అడ్వకేట్,
గిద్దలూరు, ప్రకాశం జిల్లా.
ఆంధ్ర ప్రదేశ్
సెల్ నెం. 9393442442

నిత్యావసరాల ధరలు, విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని ..

తహశీల్దారు కార్యాలయాల వద్ద ధర్నా

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

నిత్యావసర వస్తువుల ధరలు, విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ఒంగోలు నగర కమిటీ ఆధ్వర్యంలో తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా సోమవారం ధర్నా నిర్వహించారు. ధర్నాకు సిపిఎం నగర కార్యదర్శి జి.రమేష్ అధ్యక్షత వహించారు. ధర్నానుద్దేశించి సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వై.సిద్ధయ్య మాట్లాడుతూ పార్టీ కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా అన్నీ మండల కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత రూ.450 గ్యాస్ సిలిండర్ ధర రూ.1150కి చేరిందన్నారు. పెట్రోలు ధర లీటరు రూ.60 నుంచి రూ.111, డీజిల్ రూ.44 నుంచి రూ.100 పెరిగిందన్నారు. కుటుంబాలలో నెలవారి సరుకుల ధరలు 100నుంచి 200 శాతానికి పెరిగాయని తెలిపారు. అధికారంలోకి రాగానే ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మోడీ చేసిన ఎన్నికల హామీ నీటిపై రాతగానే మారిందన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ బిజెపి తెచ్చిన 2020 విద్యుత్ సవరణ చట్టం ద్వారా వైసిపి ప్రభుత్వం ట్రూఆఫ్, సర్దుబాటు, సర్ ఛార్జీలు, కస్టర్ ఛార్జీలు, ఫిక్స్ ఛార్జీలు, ఎలక్ట్రిసిటి డ్యూటీ పేర్లతో విద్యుత్ ఛార్జీలు విపరీతంగా పెంచి ప్రజల నడ్డి విరుస్తుందన్నారు. అనంతరం తహశీల్దారు కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి. కల్పన, నగర కార్యదర్శి వర్గ సభ్యులు తంబి శ్రీనివాసులు, ఎస్‌డి.హుస్సేన్, శ్రీరామ శ్రీనివాసులు, అత్తింటి శ్రీనివాసులు, టి.మహేష్, శాఖా కార్యదర్శులు జి.ఆదిలక్ష్మి, వి. మాలకొండయ్య, బి.భావన్నారాయణ, కె.విజయలక్ష్మి, పాల్గొన్నారు. **కొండపి :** నిత్యావసరాలు, విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దారు శింగరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కెజి.మస్తాన్, నాయకులు ముప్పరాజు చిన్నబ్రహ్మయ్య, పారాబత్తిని శ్రీనివాసరావు, చింతగుంట్ల అంకయ్య, పెనుమాక జకరయ్య, పెరికల ఆదాం, కుంచాల కొండయ్య పాల్గొన్నారు. **కనిగిరి :** విద్యుత్ ఛార్జీలు, నిత్యవసరాల ధరలు తగ్గించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భ:గా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జివి. కొండారెడ్డి మాట్లాడుతూ కేంద్ర. రాష్ట్ర ప్రభుత్వాలు ధరలను అదుపు చేయకుండా ప్రజల కష్టార్జితాన్ని దండుకుంటున్నాయని విమర్శించారు. గ్యాస్ ,విద్యుత్, నిత్యవసర ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దారు కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి పిసి. కేశవరావు, ఆర్.మాలకొండయ్య, ఎస్‌కె. ఖాదర్ వలి, సిహెచ్.ప్రసాద్, పి.నరేంద్ర, ఏడుకొండలు, ఎస్‌కె. బషీరా, ప్రసన్న, శాంత కుమారి పాల్గొన్నారు. **దర్శి :** పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని కోరుతూ తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దారు వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు సందు వెంకటేశ్వరరావు, నాయకులు కెవి.పిచ్చయ్య, ఉప్పు నారాయణ, నాగేశ్వరరావు, ఆదినారాయణ, నరసింహారావు పాల్గొన్నారు.**పామూరు :** నిత్యావసరాల ధరలు, విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని కోరుతూ తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దారుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కొమ్మలపాటి మాల్యాద్రి, సయ్యద్ గౌషా, షేక్ అల్లాభక్షు, సిహెచ్.వెంకటేశ్వర్లు, షేక్ ఖాసిం సాహెబ్, జి భానుమతి, బత్తుల పర్మిలాదేవి, షేక్ ఖాదరున్నీసా, మదార్‌బీ, అంకమ్మ, జయరావు, షేక్ మస్తాన్, మహదేవయ్య పాల్గొన్నారు.**మద్దిపాడు :** నిత్యవసర వస్తువులు ధరలు, విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దారు రజనీ కుమారికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఉబ్బా ఆదిలక్ష్మి, కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, కాకుమాను సుబ్బారావు, కాశీం, శ్రీను, వెంకట్రామిరెడ్డి, కనుపర్తి సుబ్బారావు పాల్గొన్నారు.**సిఎస్ పురంరూరల్ :** నిత్యావసర ధరలను తగ్గించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహశీల్దారు మధుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకుడు సన్నపురెడ్డి తిరుపతిరెడ్డి. సిపిఎం మండల కార్యదర్శి ఊసా వెంకటేశ్వర్లు, గుర్రం లక్ష్మయ్య, అంకేపల్లి వెంకటేశ్వర రెడ్డి, బిజయేసు రత్నం, జవాజి మోహన్, సంగిశెట్టి సుబ్బయ్య పాల్గొన్నారు**పొదిలి :** ప్రజలకు గుక్కెడు నీరు అందించలేని స్థితిలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉండటం సిగ్గుచేటని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.రమేష్ అన్నారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ రమేష్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం రాజకీయాలకి ఇచ్చిన ప్రాధాన్యత ప్రజలు సమస్యలు పరిష్కరించానికి ఇవ్వలేదన్నారు. అనంతరం తహశీల్దారు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాలో సిపిఎం నాయకులు ఎం.చిరంజీవి, నారయ్య, కోటేశ్వరరావు, నరసింహం తదితరులు పాల్గొన్నారు. **దొనకొండ :** నిత్యావసర వస్తువులు, విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని కోరుతూ తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు మాట్లాడారు. అనంతరం తహ శీల్దారుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు తాండవ రంగారావు, నాయకులు కుందుర్తి అనీల్, కొండా ప్రాన్సీస్,కె.శ్రీను, మేలం సుధాకర్, జె.పెద్దన్న, సిహెచ్.పెద్దన్న, కొండా అంజయ్య పాల్గొన్నారు. **కొత్తపట్నం :** నిత్యవసరాల ధరలు తగ్గించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దారుకు వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కృష్టయ్య, మీరావలి, బ్రహ్మయ్య, వర్జనమ్మ, కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. **చీమకుర్తి:** సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దారుకు అర్జీ అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి పూసపాటి వెంకటరావు, పల్లాపల్లి ఆంజనేయులు, క్రిస్టిపాటి చిన్నపురెడ్డి, తొట్టెంపూడి రామారావు, పులి ఓబుల్రెడ్డి, కె.బక్కిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనిగిరిలో ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

చీమకుర్తిలో ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

చీరాల పోలీస్‌స్టేషన్‌లో ముద్దాయి ఆత్మహత్యాయత్నం

సంతకం పెట్టేందుకు వచ్చి బ్లేడుతో గొంతు కోసుకున్న వైనం

ప్రజాశక్తి-చీరాల

పలు చోరీ కేసులలో నిందితుడిగా ఉన్న ఓ యువకుడు తన వెంట తెచ్చుకున్న బ్లేడుతో పోలీస్‌స్టేషన్లోనే గొంతు కోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన చీరాలలో సోమవారం సాయంత్రం జరిగింది. ఒన్‌టౌన్ సిఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాల మేరకు.. చీరాల మండలం, ఈపూరుపాలేనికి చెందిన ఇమ్మంది వెంకటేశ్వర్లు సుమారు ఎనిమిది చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. ఇటీవల వైర్ల చోరీ కేసులో రిమాండ్‌కు వెళ్లిన వెంకటేశ్వర్లు జామీనుపై జైలు నుంచి బయటకు వచ్చాడు. ఈ నేపథ్యంలో వెంకటేశ్వర్లు సాయంత్రం నాలుగు గంటల సమయంలో వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చాడు. తాను షరతులతో కూడిన బెయిలుతో బయటకు వచ్చానని, ప్రతి సోమవారం స్టేషన్‌కు వెళ్లి సంతకం పెట్టాలని కోర్టు వారు చెప్పారని వెంకటేశ్వర్లు స్టేషన్‌లో ఉన్న సిఐతో అన్నారు. సిఐ మాట్లాడుతూ గతంలో అతను పలు నేరాలపై 15 నిమిషాల పాటు ప్రశ్నించాడు. బెయిలుకు సంబంధించిన కోర్టు ఆర్డర్ కాపీని తెప్పించమన్నాడు. అప్పటివరకు వరండాలో కూర్చోవాలని చెప్పాడు. అనంతరం సిఐ ఛాంబర్ నుంచి బయటకు వచ్చిన వెంకటేశ్వర్లు తన వద్ద ఉన్న బ్లేడుతో గొంతు పైబాగాన కోసుకున్నాడు. పోలీసులు వెంటనే స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. డాక్టర్లు వైద్యం చేసి.. అతని పరిస్థితి నిలకడగానే ఉందన్నారు.

చికిత్స పొందుతున్న వెంకటేశ్వర్లు

పోలీసులను బెదిరించాలనే..

పోలీసులను బెదిరించాలనే ఉద్దేశంతోనే పథకం ప్రకారం పాత కేసుల నుంచి తప్పించుకునేందుకు వెంకటేశ్వర్లు ఈ విధంగా చేసినట్లు సిఐ మల్లికార్జునరావు తెలిపారు. ఇలాంటి చర్యకు పాల్పడమని తెర వెనుక ఎవరైనా ఉన్నారా? లేక ఇతనే కావాలని చేశారా? అనే కోణంలో కూడా పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నామన్నారు. తమ దర్యాప్తులో అలాంటి చర్యలకు ఎవరైనా పాల్పడాలని ఎవరైనా సూచించి పంపినట్లు తెలిస్తే వారి పై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సిఐ, ఎస్ఐ

పోలీస్ ఇంట్లో చోరీ

- 6 సవర్లు బంగారం

- రూ. 20 నగదు అపహరణ

ప్రజాశక్తి-శింగరాయకొండ

ఓ పోలీస్ ఇంట్లో దొంగలు పడి ఆరు సవర్ల బంగారు ఆభరణాలు, రూ.20 వేల నగదును అపహరించారు. ఈ ఘటన శింగరాయకొండ మండలం సోమరాజుపల్లి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... సోమరాజుపల్లి పంచాయతీ పరిధిలోని సాయినగర్ లో నివాసం ఉంటున్నా డిగలా జ్యోతిలక్ష్మి తమ కుమారుడుతో కలసి వివాహ వేడుకల కోసం గుంటూరు వెళ్లారు. సోమవారం ఇంటికి వచ్చేసరిగా తలుపు పగుల కొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలను పగుల కొట్టిఉంది. బీరువాలో దాచిన ఆరుసవర్లు బంగారం, రూ. 20వేల నగదు కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సిఐ దాచేపల్లి రంగనాథ్, ఎస్ఐ శ్రీరామ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. జ్యోతిలక్ష్మి భర్త ఎఎస్ఐగా పనిచేస్తూ గతంలో మృతిచెందాడు. దీంతో ఆయన కుమారుడికి ఉద్యోగం ఇచ్చారు. ఆయన జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రస్తుతం పని చేస్తున్నారు. ఒంగోలు నుంచి వచ్చిన క్లూస్ టీం ఘటనా స్థలంలో వేలిముద్రలు సేకరించారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రైమ్ కాలమ్

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి-దర్శి

ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 290 బస్తాల రేషన్ బియ్యాన్ని సోమవారం స్వాధీనం చేసుకున్నట్లు ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంట్ డిటీ కృష్ణమోహన్ తెలిపారు. పొదిలి రోడ్‌లో ఓ రైస్‌మిల్లులో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ చేసినట్లు తెలిపారు. అనంతరం ఆదివారం తెల్లవారుజామున 3 గంటలకు ఆటోలో బియ్యం తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తాము స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని స్థానిక రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఆయన తెలిపారు.

నిందితుడికి దేహశుద్ధి

ప్రజాశక్తి- కంభం రూరల్

కంభం పట్టణంలోని విక్టరీ థియేటర్ సమీపంలో ఓ ఇంటి ముందు నిలిపి ఉన్న బైకును ఓ యువకుడు చోరీ చేసేందుకు ప్రయత్నించాడు. స్థానికులు ఈ విషయాన్ని గమనించి నిందితుడిని పట్టుకొని దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు.

యువతిని మోసగించిన గన్‌మెన్ సస్పెన్షన్

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం డిఎస్‌పి జి.వీరరాఘవరెడ్డి వద్ద గన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న ఎఆర్ కానిస్టేబుల్ సందీప్ కొంత కాలంగా ఓ యువతిని పెళ్లి చేసుకుంటానని వంచించాడు. తీరా పెళ్లి చేసుకోమని ఆ యువతి కోరడంతో కథ అడ్డం తిరిగింది. తాను మోస పోయానని ఆ యువతి తెలుసుకుంది. సందీప్ పెళ్లికి ససేమిరా అనడంతో తగిన ఆధారాలతో జిల్లా ఎస్‌పి మల్లిక గర్గ్‌ను స్పందనలో ఆశ్రయించింది. తనకు జరిగిన అన్యాయం గురించి వివరించారు. సందీప్ వ్యవహారంపై విచారించగా వాస్తవమని తేలింది. దీంతో సందీప్‌ను సస్పెండ్ చేశారు.

ఉపాధ్యాయ దినోత్సవ ప్రత్యేకం

ప్రజాశక్తి
www.prajasakti.com
బాపట్ల
మంగళవారం 5
సెప్టెంబర్ 2023

బాపట్ల జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులు వీరే!

- నేడు బాపట్లలో అవార్డుల ప్రదానం
- జిల్లా విద్యాశాఖ అధికారి పివిజె రామారావు వెల్లడి

ప్రజాశక్తి-బాపట్ల

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లాలో ఎంపిక చేసిన 14 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానం బాపట్ల ఎమ్మెస్సార్ కల్యాణ మండపంలో మంగళవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి పివిజె రామారావు సోమవారం విలేకరులకు తెలిపారు. అవార్డులు అందుకునే ఉపాధ్యాయుల వివరాలను ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు.

జిల్లా అవార్డు గ్రహీతలు వీరే..

అవార్డు గ్రహీతల వివరాలను డిఇఒ పివిజె రామారావు వివరించారు. పి సంధ్యారాణి (జడ్పీ హైస్కూల్, చిన మట్లపూడి, నగరం మండలం), కాల్వ సోమశేఖర్, (జడ్పీ హైస్కూల్ బోడవాడ, జె. పంగులూరు మండలం), కె మోహన అంజలి (జడ్పీ హైస్కూల్ మక్కెనవారిపాలెం, సంతమాగులూరు మండలం), దాసరి సరళ కుమారి (జెడ్పీ బాలికల హైస్కూల్, ఈపురుపాలెం, చీరాల మండలం), ఎస్‌ఏ ఆదాం (కెవైఎన్‌ఎం జడ్పీ హైస్కూల్, కొనిదెల, బల్లికురవ మండలం), ఎం నాగిరెడ్డి (జిల్లా పరిషత్ హైస్కూలు, పూనూరు, యద్దనపూడి మండలం), డాక్టర్ టి వెంకటేశ్వర్లు (మున్సిపల్ హైస్కూలు, బాపట్ల), ఎన్ రోజ్ హెల్మ, (జడ్పీ బాలికల హైస్కూల్, ఈపురుపాలెం, చీరాల మండలం), పి రమేష్ బాబు (ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, వెనిగళ్లవారిపాలెం, నగరం మండలం), కెవిఎస్ఎన్ కోటేశ్వరరావు, (ప్రాథమిక పాఠశాల, ఏడో వార్డు, మోదుకూరు, చుండూరు మండలం), ఎం కోటేశ్వరరావు, ఉర్దూ ప్రాథమిక పాఠశాల, ఆరేపల్లి, చెరుకుపల్లి మండలం), కరీముల్లా బేగ్ (ప్రాథమిక పాఠశాల, కోపూరువారిపాలెం, నిజాంపట్నం మండలం), డి ఆదినారాయణ, ప్రాథమిక పాఠశాల, మూల్పూరు, అమృతలూరు మండలం), జానీ మహమ్మద్, ఉర్దూ ప్రాథమిక పాఠశాల, కట్టవ, నగరం మండలం) చెందిన ఉపాధ్యాయుల వివరాలను ఆయన వెల్లడించారు.





విద్యాలయాల ఖిల్లా.. బాపట్ల జిల్లా

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

బాపట్ల జిల్లాను విద్యాలయాల ఖిల్లాగా పేర్కొనవచ్చు. బాపట్ల పేరు వినగానే అందరికీ గుర్తుకొచ్చేది ఇక్కడ ఉన్న విద్యాలయాలు, విద్యా సంస్థలు. ప్రస్తుత కాలంలోనే కాకుండా దశాబ్దాల కిందటే ఇక్కడ ప్రతిష్టాత్మకమైన కళాశాలలు, విద్యాసంస్థలు స్థాపించారు. వీటిలో అతి ముఖ్యమైన విద్యా సంస్థలుగా ఖ్యాతి గడించినవి ఎన్నో ఉన్నాయి.

బాపట్ల వ్యవసాయ కళాశాల

1945లోనే వ్యవసాయ కళాశాల ఏర్పాటు

ఎనిమిది దశాబ్దాల క్రితమే బాపట్ల వ్యవసాయ కళాశాల ఇక్కడ ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడక ముందే అప్పటి మద్రాస్ రాష్ట్రం హయాంలో 1945లో ఈ కళాశాలను ఏర్పాటు చేశారు. బాపట్ల వ్యవసాయ కళాశాలలో విద్యార్థులు రాష్ట్రం నలు మూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు కూడా ఇక్కడ విద్యను అభ్యసిస్తూ ఉంటారు. ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల్లో అతి ముఖ్యమైన కళాశాలగా బాపట్ల వ్యవసాయ కళాశాల ఉంది. ఈ కళాశాలలో చదువుకున్న విద్యార్థులు దేశ విదేశాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు. సీనియర్ నాయకులు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు ఇక్కడ ఆచార్యులుగా పనిచేశారు. తర్వాత తన ఉద్యోగానికి రాజీనామా చేసి రాజకీయాల్లోకి వెళ్లి కేంద్రమంత్రి అయ్యారు. ఈ కళాశాలకు అనుబంధంగా ఫుడ్ సైన్స్ కళాశాల, అగ్రికల్చర్ ఇంజనీరింగ్ కళాశాల తర్వాత కాలంలో బాపట్లలో ఏర్పాటు చేశారు.

బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ ఏర్పాటుతో విద్యా విప్లవం

నాలుగున్నర దశాబ్దాల క్రితం బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ ఏర్పాటు నూతన శకానికి నాంది పలికింది. ఈ సొసైటీని అప్పట్లో ప్రముఖులు ముప్పలనేని శేషగిరిరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ఏర్పాటు అయిందే బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల. ఆంధ్ర రాష్ట్రం తొలితరం ఇంజనీరింగ్ కళాశాలలో ముందు వరుసలో బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో చెప్పుకోవచ్చు. 1981లో సువిశాల ప్రాంగణం లో ఈ కళాశాలను ఏర్పాటు చేశారు. గేట్ ర్యాంక్‌లు సాధించడంలో ఈ కళాశాల అందెవేసిన చేయి. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు ఎంతో పేరు ప్రఖ్యాతులు పొందారు. జాతీయ గేట్ రాంకుల్లో అగ్రస్థానంలో ఈ కళాశాల ఉంది. ఈ కళాశాలలో చదువుకున్న విద్యార్థులు తర్వాత కాలంలో ప్రముఖ ఇంజనీర్లుగా దేశ విదేశాల్లో స్థిరపడ్డారు. బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఏర్పాటు చేసి ఎందరో గ్రామీణ యువకులను పట్టభద్రులుగా తయారు చేశారు. ఇంజనీరింగ్ ఉమెన్స్ కళాశాల, బాపట్ల పాలిటెక్నిక్ కళాశాల, బీఫార్మసీ కళాశాలలు బాపట్లలో ఏర్పాటు చేయడంతో బాపట్ల జిల్లా కేంద్రం విద్యాలయాల ఖిల్లాగా పేరు ప్రతిష్ఠలు సంపాదించింది. అలాగే జూనియర్ కళాశాలలు, ఉన్నత పాఠశాలలు, ప్రైవేటు పాఠశాలలు మొత్తంగా అన్నీ కలిపి 100 వరకు విద్యా సంస్థలు ఒక్క బాపట్లలోనే ఉన్నాయి. 80వ దశకం నుంచి ఇప్పటి వరకు బాపట్ల విద్యా కేంద్రంగా తన పేరును మరింతగా ఇనుమడింపజేసుకుంటూ తన స్థానాన్ని నిలబెట్టుకుంది.

బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల

మెడికల్ కళాశాల నిర్మాణం ప్రారంభం.. నూతన శకానికి ఆరంభం

ఆధునిక వైద్య రంగంలో ప్రభుత్వం వేసిన ప్రధానమైన అడుగు మెడికల్ కళాశాలల ఏర్పాటు. బాపట్లకు మెడికల్ కళాశాల మంజూరు కాగా నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. మెడికల్ కళాశాల పూర్తి చేసి ప్రారంభిస్తే ఇక బాపట్ల నుంచి డాక్టర్లు తయారవుతారు. ఇది బాపట్ల కీర్తి కిరీటంలో మరో కలికితురాయిగా నిలుస్తుంది. అనుబంధ రంగాలు పుట్టుకొచ్చి ఈ ప్రాంతం విద్యా నిలయంగా ఉన్న పేరును మరింతగా పెంచుకుంటుంది. బాపట్ల జిల్లా విద్యాలయాల ఖిల్లాగా స్థానాన్ని సంపాదించడంలో ఎందరో ఉపాధ్యాయులు, ఆచార్యులు, అధ్యాపకుల కృషి ఎంతో ఉందని చెప్పుకోవచ్చు. ఉపాధ్యాయులు ఉండటం వలన ఇది సాధ్యమైంది. అలాంటి గురువులందరికీ టీచర్స్‌డే శుభాకాంక్షలు.

ఉపాధ్యాయుడు నిరంతర విద్యార్థి: ఎంఇఒ

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

ఎంఇఒ నిరంజన్

నిరంతరం అభ్యసనం చేస్తూ విద్యార్థులకు కొత్త విషయాలను బోధిస్తూ ముందుకు సాగే ఉపాధ్యాయులే మంచి విద్యార్థులను తయారు చేయగలరని బాపట్ల మండల విద్యా శాఖ అధికారి నిరంజన్ అన్నారు. సెప్టెంబర్ ఐదో తేదీన జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవం పురస్కరించుకొని ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. భారత ప్రభుత్వం ఏ వృత్తికీ ఇవ్వని ప్రాధాన్యత ఉపాధ్యాయ వృత్తికి ఇచ్చిందని అన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు తన వృత్తి పట్ల అంకితభావం కలిగి సమసమాజ నిర్మాతగా నిలవాలన్నారు. ఉపాధ్యాయులందరికీ జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

'కోన'కు ఎమ్మార్పీఎస్ వినతి

ప్రజాశక్తి-బాపట్ల

ప్రత్యేక పార్లమెంటు సమావేశాల్లో షెడ్యూల్ కులాల వర్గీకరణకు మద్దతుగా వైసిపి ఎంపీలు మాట్లాడే విధంగా కృషి చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు మాదిగ కోరారు. సోమవారం బాపట్ల శాసనసభ్యులు కోన రఘుపతికి మున్నంగి ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ ప్రతినిధి బృందం వినతిపత్రం సమర్పించారు. పార్లమెంటులో వర్గీకరణకు అనుకూలంగా మాట్లాడే విధంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే కోన హామీ ఇచ్చారు. ఈ నెల 18 నుంచి 22 వరకు జరగనున్న ప్రత్యేక పార్లమెంటు సమావేశాల్లో వర్గీకరణ చట్టబద్ధతకు కృషి చేసే విధంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో బాపట్ల జిల్లా ఎంఎస్పి కన్వీనర్ బుడంగుంట్ల లక్ష్మీనరసయ్య మాదిగ, బాపట్ల జిల్లా ఇన్‌ఛార్జి వర్ల దేవదాసు మాదిగ, బాపట్ల పట్టణ ఇన్‌ఛార్జి తాళ్లూరి రాజేష్, గాంధీ మాదిగ, వేమూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాస్ మాదిగ, రేపల్లె నియోజకవర్గ నాయకులు సత్యనారాయణ, కిషోర్ మాదిగ, అద్దంకి నియోజకవర్గ నాయకులు వరగాని రమేష్ మాదిగ, బాటసారి మాదిగ దినేష్ మాదిగ, సాయి మాదిగ పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన సిఐ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్ల పట్టణ సీఐగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన యు శ్రీనివాసరావు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

నిందితులను త్వరలోనే పట్టుకుంటాం

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

బాలుడిని హత్య చేసిన ముద్దాయిలను అతి త్వరలోనే పట్టుకుంటామని పామూరు సిఐ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని చింతలపాలెం ఎస్సీ కాలనీలో గత బుధవారం అర్ధరాత్రి అపహరణకు గురైన 16 నెలల చిన్నారి మైలారి సాత్విక్ సలోమ్ మృతదేహాన్ని పశువుల కాపరులు ఆదివారం గ్రామానికి సమీపంలో గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు బాలుడి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ సందర్భంగా సోమవారం పామూరు సిఐ కె శ్రీనివాసరావు మాట్లాడుతూ చిన్నారిని హత్య చేసిన వారు స్థానికులే అయి ఉంటారని సందేహం వెలిబుచ్చారు. నెల తక్కువ బాలుడు అయినందున బలి ఇచ్చేందుకు ఎవరైనా అపహరించుకుపోయి ఉంటారనే కోణంలో ఇప్పటివరకు దర్యాప్తు చేశామని, అయితే బాలుడి మృతదేహం గ్రామానికి సమీపంలోనే లభ్యం కావడంతో స్థానికులు కానీ, కుటుంబ సభ్యులు కానీ హత్య చేసి ఉంటారని భావిస్తున్నట్లు తెలిపారు. హంతకులను అతి త్వరలో పట్టుకుంటామని అన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలని సిపిఎం వినతి

ప్రజాశక్తి-బాపట్ల

తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య, నాయకులు

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. సిపిఎం సమరభేరి కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 30 నుంచి ఈ నెల 4వ తేదీ వరకు పలు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. చివరి రోజైన సోమవారం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహశీల్దార్ ధనలక్ష్మికి అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా సిపిఎం కార్యదర్శి గంగయ్య మాట్లాడుతూ నిరుద్యోగం, విద్యుత్ చార్జీలు, అధిక ధరలతో ప్రజలు సతమతమవుతున్నారని అన్నారు. ధరలు పెరుగుదలపై ప్రజల గోడు పాలకులకు పట్టడం లేదు. ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో గ్యాస్ సిలిండర్‌కు కేవలం రూ.200 మాత్రమే కంటి తుడుపుగా తగ్గించారు. ప్రభుత్వాలు ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం తప్పదని అన్నారు. ధరలు తగ్గించే దిశగా ప్రభుత్వాలు కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు నూతలపాటి కోటేశ్వరరావు, వై భాస్కరరావు, ఉప్పరపాలెం పార్టీ శాఖ కార్యదర్శి షేక్ మహబూబ్ సుభాని, ఐద్వా జిల్లా నాయకురాలు టి సుభాషిణి, దినేష్ పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ ప్రవేశాల రిజర్వేషన్లలో..

బిసిలకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి-బాపట్ల

కలెక్టరుకు వినతిపత్రం అందిస్తున్న బీసీ నాయకులు

రాష్ట్రంలో ఎంబిబిఎస్ అడ్మిషన్ల ప్రక్రియలో జరుగుతున్న అవకతవకలపై ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించాలని బాపట్ల జిల్లా బిసి జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షులు గొర్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం స్పందనలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎంబిబిఎస్ అడ్మిషన్స్ ప్రక్రియ మొదటి విడత ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 151ని అనుసరించి డాక్టర్ వైఎస్ఆర్ వైద్య విశ్వవిద్యాలయ అధికారులు అడ్మిషన్లు నిర్వహిస్తున్నారన్నారు. అయితే రెండో విడత అడ్మిషన్లలో ఈ జీవోను సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. జీవో 550, జీవో 111ను అనుసరించి ఓపెన్ కాంపిటీషన్ సీట్లను మొట్టమొదట భర్తీ చేయాలన్నారు. ప్రభుత్వం సత్వరమే స్పందించి డాక్టర్ వైఎస్సార్ వైద్య విశ్వ విద్యాలయ అధికారులు త్వరలో జరగబోయే మలివిడత ఎంబిబిఎస్ ప్రవేశాల్లో జీవో నెంబర్ 151, 550, 111 లను సక్రమంగా అమలు చేసి రిజర్వేషన్ అభ్యర్థులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో చేజర్ల సతీష్, అడ్వకేట్ అంగలకుదురు నటరాజన్, బీసీ నాయకులు మోర్ల చిన వెంకటేశ్వరరావు పూర్వ గుంటూరు జిల్లా నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి చీమకుర్తి కృష్ణ చైతన్య, పరిశా వెంకటగౌడ్, చీమలదిన్నె నారాయణరావు పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యార్థులకు డ్రోన్ పైలెట్ శిక్షణ

ప్రజాశక్తి-బాపట్ల

శిక్షణకు ఎంపికైన వ్యవసాయ విద్యార్థులతో అసోసియేట్ డీన్

వ్యవసాయ రంగంలో చోటు చేసుకుంటున్న యాంత్రికరణలో భాగంగా వ్యవసాయ విద్యార్థులకు డ్రోన్ పైలెట్ శిక్షణ నిర్వహిస్తున్నట్లు బాపట్ల వ్యవసాయ కళాశాల ఇన్‌ఛార్జి అసోసియేట్ బి విజయాభినందన్ సోమవారం విలేకరులకు తెలిపారు. రాష్ట్ర సెన్సార్స్ స్మార్ట్ అప్లికేషన్స్ రీసెర్చ్ ఇన్ అగ్రికల్చర్ (అప్సర) ప్రాజెక్ట్ ద్వారా వ్యవసాయ విద్యార్థులకు లామ్‌లోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో డ్రోన్ పైలట్ శిక్షణకు ఎంపికైన విద్యార్థుల వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా విజయాభినందన్ మాట్లాడుతూ రైతులు ఇతర వినియోగదారులకు అవసరమైన ప్రపంచ స్థాయి నైపుణ్యం గల వ్యవసాయ డ్రోన్ పైలట్లను ఉత్పత్తి చేయడంలో భాగంగా వ్యవసాయ విద్యార్థులకు డ్రోన్ పైలెట్ శిక్షణ నిర్వహిస్తున్నామన్నారు. బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఏ సుష్మ, కె శ్వేత, శృతి హెచ్‌బిపి హనిశ్రీ, కెజె ఐడా, ఏ పవన్ సాయి మోహిత్, రిగ్జిన్ యంగ్మో, ప్రిస్కిల్లా, కె సాయి కిరణ్, టి కృష్ణ వంశీ ఎంపికైనట్లు తెలిపారు. వ్యవసాయ విద్యలు పూర్తిస్థాయి ప్రతిభ ఆధారంగా విద్యార్థులను ఈ శిక్షణకు ఎంపికజేయడం జరిగిందన్నారు. వీరికి శిక్షణ ఈ నెల 5 నుంచి 16 వరకు 12 రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. డ్రోన్ ద్వారా విత్తనాలు చల్లడం. ఎరువులు, పురుగులు, తెగుళ్లకు క్రిమిసంహారక మందుల పిచికారీ విధానం వంటి శిక్షణ ఇస్తారు. తక్కువ సమయంలో ఎక్కువ భూమిని సాగులోకి తెచ్చుకోవడానికి ఈ విధానం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. వ్యవసాయానికి కూలీల సంఖ్య తగ్గుతుంది. దీంతో రైతు తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో మంచి ఫలితాన్ని రాబట్టేందుకు ఇది దోహదపడుతుందన్నారు. సంస్థాగత అభివృద్ధి ప్రణాళిక (ఎన్‌ఏహెచ్‌ఇపి)లో భాగంగా ఈ శిక్షణను ఇస్తారని ఆయన వివరించారు. కార్యక్రమంలో ఐడిపి, ఎన్‌ఏహెచ్‌ఏపి కో ఆర్డినేటర్లు కె చంద్రశేఖర్, వి సీతారాంబాబు, బి రత్నకుమారి పాల్గొన్నారు.

ప్రకాశం జిల్లా అభివృద్ధికి రూ.10 వేల కోట్లు కేటాయించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు

ప్రజాశక్తి- దొనకొండ

ప్రకాశాన్ని వెనుకబడిన జిల్లాగా ప్రకటించి జిల్లా అభివృద్ధికి రూ.10వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలనే డిమాండ్‌తో ఈనెల 10న దొనకొండ నుంచి సిపిఎం ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు తెలిపారు. దొనకొండలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆంజనేయులు మాట్లాడారు. కర్నూలు, గుంటూరు, నెల్లూరు జిల్లాల్లోని వెనుకబడిన ప్రాంతాలను కలిపి 1970లో ప్రకాశం జిల్లాను ఏర్పాటు చేశారన్నారు. 53 ఏళ్ల కాలంలో జిల్లా అభివృద్ధి గూర్చి పట్టించు కోలేదని, ఫలితంగా నేటికీ జిల్లా వెనుకబడిన జిల్లాగానే మిగిలి పోయిందన్నారు. వెనుకబడిన జిల్లాగా ప్రకటించేందుకు పాలకులు సిద్ధపడకపోవటం విచారకరమన్నారు. జిల్లా అభివృద్ధి చెందాలంటే నీటి వనరులను నిల్వ చేసే ప్రాజెక్టులు నిర్మించాలని, వలసపోతున్న ప్రజలకు ఉపాధి కల్పించే విధంగా పరిశ్రమల ఏర్పాటు చేయాలన్నారు. వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభమై పాతికేళ్ల గడిచినా పనులు పూర్తి కాలేదని ఎద్దేవా చేశారు. దొనకొండలో పరిశ్రమల కారిడార్, కనిగిరిలో నిమ్జ్‌కు కావాల్సినన్నీ భూములు ఉన్నా ప్రభుత్వం మౌళిక వసతులు ఏర్పాటు చేయనందున పరిశ్రమల ఏర్పాటు జరగలేదన్నారు. మార్కాపురంలో పలకలు, చీమకుర్తిలో గ్రానైట్ పరిశ్రమలపై ప్రభుత్వాలు వేస్తున్న పన్నులతో కార్మికుల ఉపాధి సంక్షోభంలో పడిందన్నారు. ప్రకాశం యూనివర్సిటీ పనులు ప్రారంభమే కాలేదన్నారు. నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేమార్గం పనులు నత్తనడకన సాగుతున్నాయని విమర్శించారు. జిల్లా అభివృద్ధి కోసం సిపిఎం చేపడుతున్న సిపిఎం పాదయాత్రకు ప్రజలు అండదండలిచ్చి జయప్రదం చేయాలని కోరారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు తాండవ రంగారావు మాట్లాడుతూ ఈనెల ఉదయం 10 గంటలకు దొనకొండ బస్టాండ్ సెంటర్‌లో పాదయాత్ర ప్రారంభ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభకు సిపిఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి, మాజీ ఎంపీ పెనుమల్లి మధు ముఖ్యఅతిథిగా హా జరవుతారన్నారు. దొనకొండ నుంచి రుద్రసముద్రం, కొచ్చెర్లకోట మీదుగా యర్రగొండ పాలెం, పెద్దారవీడు, మార్కాపురం, తర్లుబాడు, హనుమంతునిపాడు, కనిగిరి, పిసిపల్లి, కొండపి, చీమకుర్తి, సంతనూతలపాడు మండలాల మీదుగా 14 రోజులు 300 కిలోమీటర్లు పాదయాత్ర చేపట్టి ఈనెల 23న ఒంగోలు చేరుతుందన్నారు. ముగింపు రోజు ఒంగోలులో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మండల సిపిఎం కార్యదర్శి చిరుపల్లి అంజయ్య, కార్యకర్తలు కుందుర్తి అనీల్, కె.కిరణ్ కుమార్ పాల్గొన్నారు. **కనిగిరి :** ప్రకాశం జిల్లా అభివృద్ధి రూ.10 వేల కోట్లు కేటాయించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జివి. కొండారెడ్డి డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఎం చేపటనున్న పాదయాత్రను విజయవంతం చేసేందుకు సన్నాహక సమావేశం స్థానిక సుందరయ్య భవనంలో పిసి. కేశవరావు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండారెడ్డి మాట్లాడుతూ ప్రకాశం జిల్లాను వెనుకబడిన జిల్లాగా గుర్తించారు. జిల్లా అభివద్ధికి రూ.10 వేల కోట్లు కేటాయించాలని కోరారు. వెనుకబడిన ప్రకాశం జిల్లా సస్యశ్యామలం కావడం కోసం వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ప్రజా సమస్యలపై సిపిఎం చేపట్టనున్న పాదయాత్ర కనిగిరి నియోజకవర్గంలో ఈనెల 15, 16 ,17 తేదీలలో సాగనున్నట్లు తెలిపారు. కనిగిరి ప్రాంత ప్రజలు పాదయాత్రలో పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు పిల్లి తిప్పారెడ్డి, బడుగు వెంకటేశ్వర్లు, రాయళ్ల మాలకొండయ్య, ఊస వెంకటేశ్వర్లు, ఊస రాజ్యలక్ష్మి , కె. మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కంకణాల ఆంజనేయులు

నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

వల్లంశెట్టి మృతి తీరని లోటు

ప్రజాశక్తి-పామూరు

పేదల అవసరాలు తీర్చి అందరివాడు వల్లంశెట్టి ఓబుల్ (59) మృతి వారి కుటుంబానికి తీరనిలోటు అని సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ తెలిపారు. ఓబుల్ గుండెపోటుతో సోమవారం మృతి చెందాడు. ఈ విషయం గురించి తెలుసుకున్న హనీఫ్ ఓబుల్ భౌతికగాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఓబుల్ సిపిఎంతో మంచి సంబంధాలు కలిగిన వ్యక్తి అని హనీఫ్ తెలిపారు. నివాళులర్పించిన వారిలో సిపిఎం నాయకులు మీరావలి, కెజమాల్యాద్రి, ఖాశిం సాహెబ్, అల్లాభక్షు, వార్డుమెంబరు మస్తాన్, బత్తుల నాగేశ్వరరావు, చల్లా వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

పాఠశాలలో డయాస్ ప్రారంభం

ప్రజాశక్తి-కొండపి

మండల పరిధిలోని కె.ఉప్పలపాడు జిల్లా ఉన్నత పాఠశాలలో విద్యార్థులు చదువుకొనేందుకు, స్టడీ అవర్స్‌కు ఉపయోగపడే విధంగా డయాస్‌ను పాఠశాల పూర్వ విద్యార్థులు తమ సొంత నిధులతో నిర్మించారు. ఈ డయాస్‌ను మాజీ ఎమ్మెల్యే గుండపనేని అచ్యుత్‌కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పనన్నకుమార్, వైసిపి రాష్ట్ర సహాయ కార్యదర్శి డాకా పిచ్చిరెడ్డి, సర్పంచి దాయమణి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ విద్యార్థులు క్రమ శిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ రాఘవ శర్మ, ఉపసర్పంచి పి.వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులు గుంపనేని రామూర్తినాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిఎం స్థానం ప్రజల గుండెల్లో పదిలం : మంత్రి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

సిఎం జగన్మోహన్‌రెడ్డి స్థానం ప్రజల గుండెల్లో పదిలమని, జగన్ అంటే నమ్మకమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తెలిపారు. పుల్లలచెరువు మండలంలోని పిడికిటివానిపల్లి గ్రామంలో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను పంపిణీ చేశారు. సంక్షేమ ఫలాల లబ్ధి గురించి ఆరా తీశారు. ప్రజలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ యర్రగొండ పాలెం నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న జగన్మోహన్‌రెడ్డిని మరోసారి సిఎంను చేసుకునేందుకు ప్రజలు సహకరించాలన్నారు. ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలన్నారు. అనంతరం పిడికిటివానిపల్లిలో రూ. 40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ. 25 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ. ఐదు లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, సర్పంచి నారు మస్తాన్‌రెడ్డి, నాయకులు నారు వెంకట నారాయణరెడ్డి, నారు బసివిరెడ్డి, తహశీల్దార్ దాసు, ఎంపిడివో మరియబాబు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సురేష్

పూడికతీత పనులు చేపట్టాలి : కమిషనర్

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

వర్షపునీరు సాఫీగా సాగిపోయే విధంగా నగరంలోని ప్రధాన కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టాలని, అందుకు అవసరమైన నివేదికలు తయారు చేసి అందజేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం. వెంకటేశ్వరరావు ఇంజినీరింగ్ విభాగం సిబ్బందిని ఆదేశించారు. వర్షపునీరు పారుదలకు ఇబ్బందికరంగా ఉన్న మురుగు కాలువలను సోమవారం పరిశీలించారు. కొత్తపట్నం బస్టాండ్ పెట్రోలు బంకు వద్ద కాలువలో పేరుకు పోయిన చెత్తా, చెదారం, ప్లాస్టిక్ వస్తువులను శానిటేషన్ సిబ్బంది తొలగించారు. అనంతరం బాపూజీ మార్కెట్ క్లాంప్లెక్స్ వద్ద నిర్మాణంలో ఉన్న కాలువ పనులను పరిశీలించి, త్వరగా పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ విభాగం అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లు, బాటిల్స్ కాల్వల్లో వేయకుండా చెత్త ఆటోలకు అందించాలని కోరారు. ప్లాస్టిక్ కవర్లు, బాటిల్స్ కాలువలో వేస్తున్నందున మురుగు నీరు, వర్షపునీరు పారుదలకు ఇబ్బందులు వచ్చి, కాల్వలు పొంగి మురుగు రోడ్లమీదకు వస్తుందని తెలిపారు. ప్రజలు ఈవిషయంపై అవగాహన పెంచుకోవాలని కోరారు. కమిషనర్ వెంట శానిటరీ, సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

పూడిక తీత పనులను పరిశీలిస్తున్న కమిషనర్

కమిషనర్ స్పందనకు 26 అర్జీలు....

ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు వివిధ సమస్యలపై 26 అర్జీలను అందజేశారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత సెక్షన్‌ల అధికారులను కమిషనర్ ఆదేశించారు.

యడవల్లిలో 'భవిష్యత్‌కు గ్యారంటీ'

పెద్దదోర్నాల : మండల పరిధిలోని యడవల్లి గ్రామంలో భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. టిడిపి నాయకులు ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ రాబోవు ఎన్నికలలో టిడిపి విజయం కోసం ప్రతీ ఒక్కరూ కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ ఏరువ మల్లికార్జునరెడ్డి, నాయకులు భట్టు సుధాకర్‌రెడ్డి, మాబు, శేషాద్రి, కొప్పుల సుబ్బారెడ్డి, సుబ్బ రత్నం, చంటి, బాషా, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీనివాసయాదవ్, శేఖర్ పాల్గొన్నారు.

250 మందికి వైద్యపరీక్షలు

నాగులప్పలపాడు : మండల పరిధిలోని చవటపాలెం గ్రామంలో ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ దేవిరెడ్డి, డాక్టర్ విశ్వేంద్రరెడ్డి, ఆప్తమాలిజిస్ట్ రాణి ఆధ్వర్యంలో 250 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. గ్రామ సర్పంచి కాట్రగడ్డ వనజ ,కాట్రగడ్డ శ్రీనివాస్ రావు సహకారంతో ఈ వైద్యశిబిరం నిర్వహించారు. ఇసిజి, బిపి , షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ హాస్పిటల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ రఫీ. హాస్పిటల్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పిడిసిసి బ్యాంక్ చైర్మన్‌కు సన్మానం

టంగుటూరు : పిడిసిసి బ్యాంకు చైర్మన్ ప్రసాద్ రెడ్డిని టంగుటూరుకు చెందిన వైసిపి నాయకులు సన్మానించారు. స్థానిక జిల్లా కేంద్ర సహకార బ్యాంకు కార్యాలయంలో ప్రసాద్‌రెడ్డిని వైసిపి నాయకులు కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా కోపరేటివ్ బ్యాంకు అభివద్ధికి అందరూ సహకరించాలని వైసిపి నాయకులకు ప్రసాద్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కొండపి ఎఎంసి డైరెక్టర్ కొమ్ము సురేంద్ర, వైసిపి యువనేత చింతం చైతన్యరెడ్డి, ఎస్‌సి సెల్ నాయకులు కొమ్ము కోటేశ్వరరావు, ఉన్నారు.

పిసిపల్లి ఎంఇఒకు ఉత్తమ అవార్డు

పిసిపల్లి : పిసిపల్లి ఎంఇఒ-2 ఆర్.శ్రీనివాసులుకు ఉత్తమ ఎంఇఒ అవార్డుకు ఎంపికయ్యాడు. గురుపూజోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా కలెక్టర్, డిఇఒ చేతుల మీదుగా శ్రీనివాసులు అవార్డును అందుకోనున్నారు. ఉత్తమ ఎంఇఒ అవార్డుకు ఎంపికైన శ్రీనివాసులుకు యుటిఎఫ్ జిల్లా నాయకులు ఎ.పోతులూరయ్య, యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.ఏసుబాబు, సిహెచ్.రమేష్, యుటిఎఫ్ నాయకులు గౌస్, ఆర్.వేణుగోపాల్ అభినందనలు తెలిపారు.

ఉపాధ్యాయులకు ఉత్తమ అవార్డులు

కొండపి : కొండపి మండలం మిట్టపాలెం ఎంపిపిఎస్ (హెచ్‌పి)లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న యుటిఎఫ్ నాయకుడు ముప్పరాజు వీరయ్య, మండల పరిధిలోని ముప్పవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న గవిని శివశంకర్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనట్లు ఎఇఒలు కె.సురేఖ, రామారావు తెలిపారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ముప్పరాజు వీరయ్య, గవిని శివశంకర్‌ను ఎంఇఒలు, యుటిఎఫ్ మండల అధ్యక్షుడు గుమ్మళ్ల ్ంరేష్, ప్రధాన కార్యదర్శి ఎ.మాలకొండయ్య, యుటిఎఫ్ సభ్యులు, ఉపాధ్యాయకులు అభినందించారు.

లక్ష్యాలను అధిగమించాలి : డిపిఎం

మార్కాపురం : ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో అధిగమించేలా పనిచేయాలని డిఆర్‌డిఎ వైఎస్‌ఆర్ క్రాంతి పథం డిపిఎం సుబ్బారావు కోరారు. స్థానిక ఎస్‌సి బిసికాలనీలోని డ్వాక్రా బజార్‌లో విఒఎలతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డిపిఎం మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల సభ్యులు బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి ద్వారా తీసుకున్న రుణాలతో స్వయం ఉపాధి ఏర్పాటు చేసుకునేలా వారికి అవగాహన కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో ఏరియా కోఆర్డినేటర్ సుధాకర్, కపారావు. ఎపిఎం రమేష్‌బాబు , స్త్రీ నిధి మేనేజర్ సులోచన, ఎలొసి నాగభూషణం, సీసీలు మనో కుమారి పాల్గొన్నారు.

వైసిపిలో వీధికెక్కిన గ్రూపుల పోరు

ప్రజాశక్తి-భట్టిప్రోలు

అధికార పార్టీలో గ్రూపుల పోరు తారాస్థాయికి చేరింది. భట్టిప్రోలు మండలం, పల్లికోన గ్రామంలో సోమవారం రాత్రి ఒక గ్రూపు వారు మరో గ్రూపునకు చెందిన వారి బైకులను ధ్వంసం చేయడమే కాక కారు అద్దాలు పగలగొట్టి బీభత్సం సృష్టించారు. గ్రామ పార్టీ అధ్యక్షుడిగా మాజీ ఎంపిటీసీ ఉన్న సేరు శ్రీనివాసరావు, మాజీ గ్రామ సర్పంచ్ మండవ రామకోటేశ్వరరావుల మధ్య పార్టీ వ్యవహారాల్లో విభేదాలు నెలకొన్నాయి. పార్టీకి వ్యతిరేకంగా మండవ రామకోటేశ్వరరావు, అదే పార్టీకి చెందిన కుమారస్వామి వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ ఇటీవల సేరు శ్రీనివాసరావు మండవ రామకోటేశ్వరావును పార్టీ నుండి తొలగిస్తున్నట్లు మౌఖికంగా ప్రకటించారు. అప్పటినుండి గ్రామంలో అధికార పార్టీ నాయకుల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరాయి. ఒక దశలో అధికార పార్టీ కార్యకలాపాలు నచ్చకపోవడంతో రామకోటేశ్వరరావు, కుమారస్వామిలు పార్టీని వీడే ఆలోచన కూడా చేసినట్లు తెలిసింది. వీరిని ఏదో విధంగా భయపట్టాలనే ఆలోచనతో సేరు శ్రీనివాసరావు గ్రూపు సోమవారం రాత్రి కుమారస్వామి ఇంటిముందు ఉన్న నాలుగు బైకులు, ఒక కారును ధ్వంసం చేసింది. అడ్డొచ్చిన కుమారస్వామిపై, ఆయన కుటుంబసభ్యులపై కూడా చేయి చేసుకున్నట్లు సమాచారం.

అధికారపార్టీ నేత ఇంటిపై మరో నేత గ్రూపు దాడి

అధికారపార్టీ నేత ఇంటిపై మరో నేత గ్రూపు దాడి

దీంతో కుమారస్వామి 100కు ఫోన్ చేసి.. పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సేరు శ్రీనివాసరావు కూడా తన గ్రూపుపైనే కుమారస్వామి దాడి చేశాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు రెండు గ్రూపులనూ పిలిపించి.. మాట్లాడారు. ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకుంటే పార్టీకి నష్టం జరుగుతుందని.. జరిగింది ఏదైనా ఎవరికి వారు మర్చిపోయి.. పార్టీ కోసం పనిచేయాలని సూచించారు. మోపిదేవి సూచనలు పాటిస్తారా లేక విభేదాలను కొనసాగిస్తారా.. అనేది చూడాలి.

నియోజకవర్గ అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

ప్రజాశక్తి-అద్దంకి

నియోజకవర్గ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి, దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ వెల్లడించారు. సోమవారం సింగకొండ దేవస్థానం వద్ద కళ్యాణ మండపంలో అద్దంకి నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశం జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి మాట్లాడుతూ అద్దంకి నియోజకవర్గ పరిధిలోని ప్రజలకు అవసరమైన గహాలను మంజూరు చేయడానికి ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులకు సూచించారు. అద్దంకి నియోజక వర్గములో అర్హులైన లబ్ధిదారులకు ఓ.టి.ఎస్ కింద రిజిస్ట్రేషన్ చేయాలని అధికారులకు చెప్పారు. జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. అద్దంకి పట్టణంలో టిడ్‌కో గహాలను పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. అద్దంకి

మాట్లాడుతున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

నియోజకవర్గ పరిధిలోని మంజూరు చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను వెంటనే పూర్తి చేయాలని చెప్పారు. గుండ్లకమ్మ ప్రాజెక్ట్ భూ సేకరణకు, పునరావాసం కోసం అవసరమైన రూ.110 కోట్లు మంజూరు చేయడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామన్నారు. అద్దంకి పట్టణంలో జలజీవన్ మిషన్ కింద ఇంటింటికీ కుళాయి అందిస్తామన్నారు. వర్షాలు తక్కువగా ఉన్నందున రైతులు వాణిజ్య పంటలు వేసుకోవాలన్నారు. ఈ నెలలో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఖరీఫ్ పంటలు వేసుకోవడానికి ఈ నెలాఖరు వరకు వేచి ఉండాలన్నారు. సమావేశంలో అద్దంకి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాచిన కష్ణచైతన్య, జాయింట్ కలెక్టర్ శ్రీధర్, వ్యవసాయ శాఖ జె.డి అబ్దుల్ సత్తార్, పశు సంవర్ధక శాఖ జెడి హనుమంతరావు, మత్స్య శాఖ జె.డి సురేష్, జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు, పౌర సరఫరాల శాఖ డి.ఎం శ్రీలక్ష్మి, డి.ఎస్.ఓ విల్లేమ్స్, తదితరులు పాల్గొన్నారు.

నిర్దిష్ట గడువు లోపు సమస్యలను పరిష్కరించాలి

ఎస్పీ వకుల్‌జిందాల్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

నిర్దిష్ట గడువు లోపు స్పందన ద్వారా వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించాలని బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అధికారులను ఆదేశించారు. సోమవారం బాపట్ల జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజలు వారి సమస్యలను స్వయంగా ఎస్పీకి విన్నవించుకున్నారు. ఎస్పీ వారి సమస్యలు క్షుణంగా విని, ఫిర్యాదులను పరిశీలించి సంబంధిత పోలీస్ అధికారులతో మాట్లాడి స్పందన ద్వారా వచ్చిన ఫిర్యాదులపై చట్టపరంగా విచారణ జరిపి, నిర్దిష్ట గడువు లోపు సమస్యలను పరిష్కరించి, బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. వివిధ సమస్యలతో 57 మంది ఫిర్యాదుదారులు జిల్లా ఎస్పీకి వారి సమస్యలు విన్నవించుకున్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ పి.మహేష్ పాల్గొన్నారు.

అర్జీలు పునరావృతం కాకుండా చర్యలు

కలెక్టర్ రంజిత్‌బాషా

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జగనన్నకు చెబుదాం పోర్టల్ లో నమోదయ్యే అర్జీలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా చెప్పారు. స్పందన కార్యక్రమం స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో సోమవారం జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులు తమ సమస్యలు పరిష్కరించాలంటూ వినతిపత్రాల ద్వారా కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. స్పందనలో 80 అర్జీలు నమోదయ్యాయి. తన పరిధిలోని వాటిని తక్షణమే ఆయన పరిష్కరించారు. మిగిలిన ఆర్జీలపై అక్కడికక్కడే వీక్షణ సమావేశం ద్వారా మండల స్థాయి అధికారులతో విచారించి పరిష్కార మార్గం చూపారు. మరికొన్నింటిని పరిశీలన, విచారణకు కలెక్టర్ ఆదేశించారు. స్పందన, జగనన్నకు చెబుదాం పోర్టల్ లో నమోదయ్యే అర్జీలకు అధిక ప్రాధాన్యతనిచ్చి పరిష్కరించాలని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణాలలో పురోగతి సాధించాలని చెప్పారు. గ్రామ సచివాలయాలు, ఆర్ బి కే లు, వైయస్సార్ ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలు పూర్తి చేయాల్సిన లక్ష్యం అక్టోబర్ ఒకటవ తేదీ నాటికి పొడిగించినట్లు తెలిపారు. వేగంగా నిర్మాణాలు జరగాలని సూచించారు. ముఖ్యంగా వర్షాకాలం ప్రారంభమైనందున గ్రామాలలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ సిహెచ్ శ్రీధర్, డిఆర్ఓ కె.లక్ష్మీశివజ్యోతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.